## ట్రాఫిక్ రూల్స్ పాటిస్తున్న ఆటో డ్రైవర్లకు అభినందన



తాడ్వాయి గ్రామ ఆటో డ్రైవర్లతో ఎస్సై ఆంజనేయులు

తాడ్వాయి, అక్టోబర్ 16: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్న మండల కేంద్రంలో ప్యాసింజర్ ఆటో డ్రైవర్లను ఎస్సై ఆంజనేయులు సోమవారం అభినందించారు. గ్రామంలో 31 ప్యాసింజర్ ఆటోలు ఉండగా, ఇందులో కొందరికి లైసెన్సు, వాహనాలకు ఇన్సురెన్స్ లేకపోవడం, ఇతరుల పేరు మీద ఆర్‌సీ పుస్తకాలు ఉండడంతో వాటన్నింటినీ గడువులోపు సరిచేసుకోవాలని ఎస్సై సూచించారు. దీంతో ఆటో డ్రైవర్లందరూ ట్రాఫిక్ నిబంధనలు ప్రకారం అన్ని రకాల ధ్రువపత్రాలు తీసుకోవడంతో ఎస్సై అభినందించి, తాడ్వాయి పీఎస్ నంబర్లను అందజేశారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు గోల్కొండ రాజయ్య, శంకర్‌గౌడ్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడికి సన్మానం



మామిండ్ల భానును సన్మానిస్తున్న అంబేద్కర్ సంఘం ప్రతినిధులు

సదాశివనగర్, అక్టోబర్ 16: మండలంలోని పద్మాజివాడి గ్రామానికి చెందిన అగ్ని వీరుడు(ఆర్మీజవాన్) మామిండ్ల భానును స్థానిక అంబేద్కర్ సంఘం ప్రతినిధులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. నేటి యువత భానును ఆదర్శంగా తీసుకుని ఆర్మీలో చేరి దేశానికి సేవలు అందించాలని సూచించారు. అగ్నిపథ్‌లో చేరి శిక్షణ పూర్తిచేసుకొని సోమవారం గ్రామానికి వచ్చిన భాను, ఆయన తల్లిదండ్రులను అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రతినిధులు ఉపాధ్యాయుడు మంత్రి రాజు, మామిండ్ల శివరాజు, పెద్ద బూరి విఠల్, మంత్రి కళావతి, మామిండ్ల రాజయ్య, నాగయ్య, సాయిలు, పెద్దబూరి సాయికుమార్, చరణ్ తేజ, గణేశ్, సాయికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులపై దాడులు



బేగంపూర్‌లో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్16: మండలంలోని బేగంపూర్ గ్రామంలో బెల్ట్ షాపులపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 8.4 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్సై రాములు మాట్లాడుతూ..బేగంపూర్ గ్రామంలో ఉప్పరి హన్మాండ్లు బెల్టు షాపు నిర్వహిస్తున్నాడని తెలిపారు. 8.4 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాగి గ్రామంలో మద్యం బాటిళ్లను పట్టుకున్న ఎస్సై రాజశేఖర్

**మాగి గ్రామంలో..**

నిజాంసాగర్, అక్టోబర్16: మండలంలోని మాగి గ్రామంలో మెంగారం విఠల్ నివాసంలో బెల్టు దుకాణం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం దాడిచేసినట్లు నిజాంసాగర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బీరు, క్వాటర్ సీసాలను స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# పథకాలను వివరిస్తే చాలు.. గెలుపు మనదే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్



హాజరైన నియోజకవర్గ స్థాయి బూత్‌లెవల్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు

- విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా చేయాలి
- బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో అన్నివర్గాల అభివృద్ధి
- కాంగ్రెస్‌వి అలవికాని అడ్డగోలు హామీలు
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 16: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తే చాలని, గెలుపు మనదేనని, మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. లింగంపేట్ మండల కేంద్రంలోని జీఎన్‌ఆర్ గార్డెన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన నియోజకవర్గస్థాయి బూత్‌లెవల్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గం ప్రధానపాత్ర వహించిందని తెలిపారు. ఎల్లారెడ్డిలో మొదటగా బీఆర్‌ఎస్ జెండా మోసింది తానేనని గుర్తుచేశారు. ఎన్నికల వేడి ప్రారంభమైందని, ప్రతి బూత్ లెవల్ కార్యకర్తలు, పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు గెలిచేవరకు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఇతర పార్టీలకు ఇప్పటివరకు ఆ పార్టీల తరపున అభ్యర్థులను ప్రకటించే పరిస్థితికూడా లేదన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు మళ్లీ మొదలవుతాయన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులను ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రారంభించిన ప్రజా సంక్షేమ పథకాలను జ్ఞాపకం చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు.

**మ్యానిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు: మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్**

మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అలవికాని అడ్డగోలు హామీలను ఇచ్చి అధికారం లోకి వచ్చాక అమలుచేయలేక చేతులెత్తేసిందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యంరావ్, మాజీ వైస్ చైర్మన్ నరహరి, గాంధారి, నాగిరెడ్డిపేట్ జడ్పీటీసీలు శంకర్‌నాయక్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

# షిండేను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం

## బీఆర్‌ఎస్ డోంగ్లీ మండల నాయకులు

డోంగ్లి, అక్టోబర్ 16: జుక్కల్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ షిండేను భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని బీఆర్‌ఎస్ డోంగ్లి మండల అధ్యక్షుడు శశాంక్ పటేల్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రస్తుత పథకాలు కొనసాగించడంతోపాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ధ్యేయంగా బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను రూపొందించారని అన్నారు. షిండే నిత్యం ప్రజల కోసం తపించే వ్యక్తి అని పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ రామ్ పటేల్, మండల ఉపాధ్యక్షుడు ఆనంద్ పటేల్, విండో వైస్ చైర్మన్ విజయ్ పటేల్, మాజీ చైర్మన్ అశోక్ పటేల్, సర్పంచులు మధుకర్ పటేల్, రాజు పటేల్, సూర్యకాంత్ పటేల్, నాయకులు మాణిక్‌రావ్, నక్కేవార్ లాలు,బస్వంత్, చాంద్ పటేల్, గైక్వాడ్ విలాస్,మన్నూ పటేల్, హన్మంతురావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శశాంక్‌పటేల్

# ఎన్నికల నిర్వహణపై గట్టి నిఘా

## అదనపు కలెక్టర్ మనుచౌదరి



మద్నూర్ మండల కేంద్రంలో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

మద్నూర్, అక్టోబర్16: ఎన్నికల నిర్వహణపై నిఘా ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండకేంద్రంలోని స్ట్రాంగ్ రూంను పరిశీలించామని, అక్కడి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు అంతర్రాష్ట్ర, జిల్లాల చెక్‌పోస్టుల్లో నిఘా విభాగంతో పాటు వీడియో రికార్డింగ్, సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచినట్లు చెప్పారు. ఇప్పటికే ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టి తదితరల బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో సైతం నామినేషన్ వేసే విధానాన్ని ఈ సంవత్సరం కొత్తగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రచారానికి సంబంధించిన అనుమతులు పొందడానికి 48 గంటల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ ముజీబ్, నాయబ్ తహసీల్దార్ భరత్, గిర్దావార్ శంకర్ తదితరులు ఉన్నారు.

# చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 16: నాగిరెడ్డి మండలం పోచారం చెక్‌పోస్ట్ వద్ద సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఓ ద్విచక్రవాహనదారుడి వద్ద నుంచి రూ. 80వేలు లభ్యం కాగా.. వాటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోడంతో స్వాధీనం చేసుకొని, ఎఫ్‌ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు రూ. 50వేలకన్నా ఎక్కువ నగదును తీసుకెళ్లరాదని సూచించారు. ఒకవేళ తీసుకెళ్తే వాటికి సంబంధించిన ఆధారాలు వెంట ఉంచుకోవాలన్నారు. తనిఖీల్లో నాగిరెడ్డిపేట్ ఎస్సై రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**మద్దెల్‌చెర్వు రహదారిపై ..**

పిట్లం, అక్టోబర్ 16: మండలంలోని మద్దెల్‌చెర్వు చౌరస్తా వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారి బ్రహ్మం వారి సిబ్బందితో కలిసి సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు తనిఖీబృందానికి సహకరించాలని, ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## జిల్లా దవాఖానకు వచ్చిన మహిళ అదృశ్యం



మల్లవ్వ(ఫైల్)

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 16 : నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ అదృశ్యమైంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం గండి మాసాన్‌పల్లికి చెందిన లచ్చి ప్రేమయ్య –కరుణవ్వ (మల్లవ్వ) దంపతులు నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు వచ్చారు. వారం రోజుల క్రితం తమ కూతురు అనారోగ్యంతో ఉండడంతో దవాఖానలో చేర్పించారు. తన కూతురు వద్ద ఉన్న మల్లవ్వ ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో బయటికి వెళ్లి తిరిగి రాలేదు. తన భార్య ఆచూకీ లభించడం లేదని భర్త లచ్చి ప్రేమయ్య పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఫొటో ఆధారంగా మహిళ ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో–87126 59837, పోలీస్‌స్టేషన్–08462 220150 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.